# బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

- కోడ్ అమలు పటిష్టంగా జరగాలి
- పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి
- విధులు నిర్వర్తించే వారి శిక్షణను త్వరగా పూర్తి చేయాలి
- సమావేశంలో కలెక్టర్ పీ ప్రావీణ్య

ఖిలావరంగల్, అక్టోబర్ 13: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారులు విధులను ఎంతో బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆర్వోలు, నోడల్ అధికారులు, ఏఆర్వోలతో ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్ బృందాలకు శిక్షణ, ఓటరు ఫారం 6, 7, 8 పరిష్కరణ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, సీ విజిల్, సువిధ యాప్ తదితర అంశాలపై నియోజకవర్గాల వారీగా శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ నిబంధనలు, కోడ్ అమలు పటిష్టంగా జరగాలన్నారు. జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట రిటర్నింగ్ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల్లో రాంపులు, మహిళలు, పురుషులకు వేర్వేరు టాయిలెట్ల తదితర సౌకర్యాలను పరిశీలించాలన్నారు. ఏమైనా మరమ్మతులు ఉంటే వారంలోగా పూర్తి చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే బృందాలకు శిక్షణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సువిధ ద్వారా ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేయాలన్నారు. సీ విజిల్‌కు వచ్చే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు షేక్ రిజ్వాన్‌భాషా, అశ్విని తానాజీ వాకడే, కృష్ణవేణి, డీఆర్డీవో పీడీ సంపత్‌రావు, జిల్లా నోడల్ అధికారులు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

# రాష్ట్రంలో ముదిరాజ్‌లకు గౌరవం పెరిగింది

- వారి ఎదుగుదలకు పెద్ది సహకరించాలి
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- నర్సంపేటలో ఆత్మగౌరవ భవనం నిర్మించాం
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, అక్టోబర్ 13: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులకు అన్ని విధాలా గౌరవం పెరిగిందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సంపేటలో మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిలి అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బండా ప్రకాశ్‌తోపాటు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ప్రత్యేకంగా సహకరించాలని పెద్దిని కోరారు. సుదర్శన్‌రెడ్డి మాట్లాడతూ ముదిరాజ్ సామాజిక వర్గానికి నర్సంపేట పట్టణంలో భూమి కేటాయించి ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. సామాజిక వర్గాల ఐక్యతను విచ్ఛిన్నం చేయాలనే ప్రతిపక్షాల కుట్రలను కట్టడి చేశామన్నారు. గతంలో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుటుక సోమయ్య ముదిరాజ్‌ను, ఈసారి నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పొన్నం మొగిలిని నియమించి ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించినట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్‌ల ఆశీస్సులు తనకు ఉండాలని కోరారు. కార్యక్రమంలో గుంటుక సోమయ్య, శానబోయిన రాజ్‌కుమార్, చొప్పరి సోమయ్య, గోనెల పద్మ, అమర్ చంద్, నూనె నర్సయ్య, తూటి శ్రీను, ఈర్ల నర్సింహరాములు, రవి, నాయిని వేణుచంద్ పాల్గొన్నారు.

# లవ్.. నర్సంపేట

నర్సంపేట, అక్టోబర్ 13: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో నర్సంపేటలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిలో భాగంగా ప్రధాన కూడళ్లను ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. చౌరస్తాలో నిర్మాణాలు చేపట్టారు. పాకాల, మహబూబాబాద్‌కు వెళ్లే రోడ్డు కూడలిలో వివిధ జంతువులతో కూడిన బొమ్మలను ఏర్పాటు చేశారు. వరంగల్‌రోడ్డు కూడలిలోనూ నిర్మాణాలు చేపట్టారు. లవ్ నర్సంపేటను ఏర్పాటు చేస్తుండడంతో పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ, దసరా పండుగలలోపు పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.




వరంగల్‌రోడ్డు కూడలిలో లవ్‌నర్సంపేట



నర్సంపేట పాకాల రోడ్డులో రూపుదిద్దుకున్న చౌరస్తా

# పురాతన కట్టడాలను సంరక్షించాలి

వెంకటాపూర్, అక్టోబర్ 12: పురాతన కట్టడాల పరిరక్షణకు తోడ్పాడాలని, వాటి సంరక్షణకు వలంటీ ర్లు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నా రు. పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయ ప్రాంగణంలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ క్యాంపెయిన్ శుక్రవారం ముగింపు కార్యక్రమం జరి గింది. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు శ్రీధర్‌రావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా శైలజ రామ య్యర్, కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. ముందుగా వలంటీర్స్ తాము ఈ పన్నెండు రోజులుగా ఏం నేర్చు కున్నామో, వాళ్ల అనుభవాలు వివరించారు. ఈ సంద ర్భంగా శైలజ మాట్లాడుతూ కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి పురాతన కట్టడాలను కాపాడాలన్నారు. పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీతో సమావేశమై రామప్పలో జరుగాల్సిన పనులు, అభివృద్ధి కోసం చర్చిస్తామన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఐఏఎస్ కోసం కాకతీయ సామ్రాజ్యం గురించి తాను చదివానని, ఆ తర్వాత ఇక్కడే కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించడం ఆనందంగా ఉందన్నారు.

# 'ఎస్సార్'లో ఎడ్యుకేషన్ యూఎస్ ఏ ఫెయిర్-2023



విద్యార్థులకు వివరిస్తున్న యూనివర్సిటీల ప్రతినిధులు

హసన్‌పర్తి, అక్టోబర్ 13: అనంతసాగర్‌లోని ఎస్సార్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఎడ్యుకేషన్ యూఎస్ ఏ ఫెయిర్-2023ను శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్ తెలిపారు. యూకేకు సంబంధించిన 15కు పైగా యూనివర్సిటీలు హాజరైనట్లు చెప్పారు. అకాడమిక్ ఎక్స్ ప్లోరెషన్, యూజీ, పీజీ, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్ కోర్సులు, సమాచార సెషన్స్ యూఎస్ వీసా ప్రాసీడింగ్ ప్రక్రియ, విదేశాలకు వెళ్లి చదువుకోవాలనుకునే విద్యార్థులకు అక్కడి స్కాలర్‌షిప్‌లపై తల్లిదండ్రులకు వివరించారు. ఈ ఫెయిర్ ద్వారా అందించే విలువైన సమాచారం విద్యార్థులకు ఉద్యోగావకాశాలు, రక్షణ కోసం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అపార్చునిటీస్, కార్పొరేట్ ఔట్‌రీచ్ ప్రీతాచక్రబోగర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డీన్‌లు డాక్టర్ గురురావు, మహేశ్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి బొడ్డెమ్మ

వర్ధన్నపేట, అక్టోబర్ 13: తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న బొడ్డెమ్మ శుక్రవారం సాయంత్రం గంగమ్మ ఒడికి చేరింది. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా యువతులు, మహిళలు పుట్టమట్టితో అత్యంత పవిత్రంగా బొడ్డెమ్మను తయారు చేశారు. తొమ్మిది రోజులపాటు ప్రతి రోజూ సాయంత్రం సమయంలో యువతులు, మహిళలు బొడ్డెమ్మ వద్ద పాటలు పాడుతూ అమ్మవారిని కొలిచారు. ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకోవడంతోపాటు మహిళలు తమ పసుపు కుంకుమలను చల్లగా చూడాలని బొడ్డెమ్మను పాటల రూపంలో వేడుకుంటారు. చివరిరోజు జరిగిన బొడ్డెమ్మ ముగింపు ఉత్సవంలో భాగంగా నల్లబెల్లిలో జరిగిన వేడుకల్లో ఎంపీటీసీ దుగ్యాల జ్యోతి, ఇతర గ్రామాల్లో మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు, యువతులు ఉత్సాహంగా బొడ్డెమ్మ వద్ద ప్రత్యేకంగా కోలాటాలు వేసి పాటలు పాడి సమీపంలోని చెరవులు, బావుల్లో నిమజ్జనం చేశారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరెలు కట్టుకొని మహిళలు బొడ్డెమ్మ వద్ద సందడి చేశారు.

**బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు**

శనివారం బతుకమ్మ పండుగ ప్రారంభం కానుండడంతో గ్రామాలతోపాటు వర్ధన్నపేట పట్టణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 8 రోజులపాటు అన్ని గ్రామాల్లోని ఆలయాల ఆవరణల్లో మహిళలు బతుకమ్మ ఆడుకుంటారు. దీంతో ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. మహిళలు ఆలయాలకు వచ్చేందుకు రహదారులను శుభ్రం చేయించి వీధిదీపాలను కూడా ఏర్పాటు చేశారు. వర్ధన్నపేట పట్టణంలోని రామాలయం వద్ద ఉన్న రంగలీలా మైదానాన్ని మున్సిపల్ అధికారులు శుభ్రం చేసి బతుకమ్మ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



నల్లబెల్లిలో బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

# జిల్లాలో రూ.15,38,880 నగదు సీజ్

**కలెక్టర్ పీ ప్రావీణ్య**

ఖిలావరంగల్, అక్టోబర్ 13: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ నిర్వహించిన తనిఖీల్లో శుక్రవారం రూ. 6,22,820 నగదును స్వాధీనం చేసుకున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పీ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులుగా జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన తనిఖీల్లో రూ. 15,38,880 నగదును సీజ్ చేసినట్లు ఆమె వెల్లడించారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన 232 మందిని గుర్తించి, వారిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాల్లో 1383.16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని, 44 మందిపై కేసులు నమోదు చేసి ఒక్కరిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

## బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింటు శ్రీ ఎస్. ప్రవీణ్ కాక, తండ్రి: ఎస్. వెంకట్ రామ్, నివాసము: నాగోల్, హైదరాబాద్ గారు దిగువ షెడ్యూలు ఆస్తికి స్వంతదారుడు. వారి డాక్యుమెంటు నంబరు 2125/2012, తేది: 12.03.2012 ద్వారా షెడ్యూలు ఆస్తికి స్వంతదారుడు అయ్యారు. అయితే ఈ మధ్య శ్రీమతి పి. జ్యోతి, భర్త శివశేషు బాబు, నివాసము, నారపల్లి, హైదరాబాద్ అనే మహిళ షెడ్యూలు ఆస్తికి తాను స్వంతదారునని నమ్మబలుకుతూ ఇతరులకు అమ్మజూపుటకు ప్రయత్నిస్తున్నదని తెలియవచ్చినది. షెడ్యూలు ఆస్తిపై సదరు జ్యోతికి ఎటువంటి right, title or interest లేదని ఈ బహిరంగ ప్రకటన ద్వారా హెచ్చరించనైనది. ఈ ప్రకటన చూసికూడా ఎవరైనా షెడ్యూలు ఆస్తి గురించి జ్యోతితో గాని వేరెవరితో గాని లావాదేవీలు జరిపినచో నా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులు అగుదురని హెచ్చరించనైనది.

**షెడ్యూలు ఆస్తి**

Plot No. 28లో గల 446Sq. Yards or 372.85 Sq. Mtrs., లోగల ఖాళీజాగా In Ward No,6, Block No.2, Situated at Kakaji Colony, Hanumakonda మరియు హద్దులు: **తూర్పు:** others Complex, **పడమర:** Others Complex, **ఉత్తరం:** 50అడుగుల రోడ్, **దక్షిణం:** KR & MS Complex.

సం/- యం. జగన్, అడ్వకేట్
H.No. 2-15-2, Beerappa Nagar,
Uppal, Hyderabad-500039
Phone: 9550246044